నేడు యథావిధిగా కాకినాడలో స్పందన

ప్రజాశక్తి-కాకినాడ

జగనన్నకు చెబుదాం జిల్లా స్థాయి స్పందన ప్రజా విజ్ఞాపనల స్వీకార కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి కలెక్టరేట్ స్పందన హాల్లో జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు, జిల్లా అధికారులు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ సూచించారు. డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ఆగస్టు 22న మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను టోల్ ఫ్రీ నెంబర్ 18004253077కు ఫోన్ చేసి కలెక్టర్‌కు తెలియజేయవచ్చని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఒత్తిళ్ల నడుమ హెల్త్ సెక్రటరీలు

- 70 రకాల మొబైల్ యాప్‌లు
- పెరిగిన పనిభారం
- పిఆర్‌సి వేతనాలు, సౌకర్యాలు నిల్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రజలకు వైద్య, ఆరోగ్య సేవలు సక్రమంగా అందేలా పని చేస్తున్న సచివాలయాల్లోని గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీలు పని ఒత్తిడితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లావ్యాప్తంగా వైద్య, ఆరోగ్యశాఖ కార్యక్రమాలను, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలకమైన పాత్ర నిర్వహిస్తున్న వీరంతా విధి నిర్వహణలో అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రధానంగా పలు రకాల యాప్‌ల పని భారం ఎక్కువై అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. జిల్లావ్యాప్తంగా 503 మంది హెల్త్ సెక్రటరీలు విధి నిర్వహణలో సమయ పాలన లేకుండానే కష్ట పడుతున్నారు.

మోయలేని యాప్‌ల భారం

దాదాపు 70 రకాల యాప్ ల భారంతో హెల్త్ సెక్రటరీలు ఆయా సచివాలయాల్లో మోయలేని భారంతో సతమతమవుతున్నారు. గ్రామ, వార్డుల పరిధిలో గర్భిణులు, పిల్లలకు టీకాలు, పాఠశాలల్లో విద్యార్థులకు ఇచ్చే మందుల వివరాలు, ఫీవర్ సర్వే, ఫ్రైడే డ్రైడే, శానిటేషన్, లెప్రసీ, టిబి వంటి డేటాను ప్రతిరోజూ యాప్‌లలో పొందుపరచాల్సి వస్తోంది. ఎన్‌సిడిసిడి, అభ, ఆర్‌సిహెచ్, అనమోల్, ఎన్‌డిడి, ఎన్‌ఎల్ఇపి తదితర యాప్‌లతో బాటు ఆయా సచివాలయాల పరిధిలో కొత్తగా ఎవరైనా వ్యాక్సిన్ వేయించుకుంటే ఇటీవల కొత్తగా వచ్చిన యులిన్ యాప్‌లో నమోదు చేయాలి. ఇవి కాక ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చే రోగులు ఆస్పత్రిలో చేసినప్పటి నుంచి ఇంటికి వచ్చే వరకూ 10 రకాల యాప్‌లలో సమాచారాన్ని నమోదు చేయాలి. ఇలా డ్యూటీ సమయానికి సంబంధం లేకుండా గంటల తరబడి హెల్త్ సెక్రటరీలు యాప్‌లతో కుస్తీలు పడుతున్నారు. డ్యూటీ సమయం ముగిసినా ఇళ్లకు వచ్చిన తర్వాత కూడా రాత్రి 10 గంటల వరకూ యాప్‌ల పని చేయాల్సి వస్తోంది. ఈ క్రమంలో అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నామని సెక్రటరీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక సమస్యలతో ఒక్కో సందర్భంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో అధికారుల నుంచి ఒత్తిళ్లకు గురై సతమతం అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పని ఎక్కువ.. వేతనాలు తక్కువ

రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నా వీరికి కనీస వేతనాలు అందడం లేదు. 2022 పిఆర్‌సి ప్రకారం వేతనాలు ఇవ్వాలని సెక్రటరీలు డిమాండ్ చేస్తున్నారు. వీరికి దాదాపు 9 నెలలు లేటుగా ప్రొబేషన్ డిక్లేర్ చేశారు. అయితే ఈ కాలాన్ని పరిగణలోకి తీసుకోకుండా సీనియారిటీ ఇవ్వలేదు. కావున 9 నెలల వేతన బకాయిలు చెల్లించాలని, నోషనల్ ఇంక్రిమెంట్స్, జనవరి నుండి డిఎ ఇవ్వాలని కోరుతున్నారు. వాస్తవానికి 2,500 జనాభాకు ఒక ఎఎన్ఎం ఉండాలి. కానీ చాలా సచివాలయాల్లో 4 నుంచి 8 వేల జనాభాకు ఒక ఎన్ఎం పనిచేస్తున్న మూలంగా పని ఒత్తిడి పెరిగింది. డ్యూటీ సమయాల్లో కాక జూమ్ మీటింగ్‌లను ఇష్టారీతిన నిర్వహిస్తున్నారు. ఇతర సచివాలయ ఉద్యోగుల వలే సాయంత్రం 5 గంటల వరకే పని ఉండేలా తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సెలవు మంజూరు కోసం వివిధ విభాగాల్లో ఆరుగురు అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సి వస్తోంది. వైద్య, ఆరోగ్య శాఖలోని రెగ్యులర్ క్షేత్రస్థాయి సిబ్బందికి అమలవుతున్న విధంగా హెల్త్ సెక్రటరీలకు 35 క్యాజువల్ లీవ్‌లు, ఇతర లీవులు అమలు కావడం లేదు. ఇలా అనేక సమస్యలు నడుమ వీరంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పని ఒత్తిడి తగ్గించాలని రెండు రోజుల క్రితం కాకినాడ కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

కాకినాడ కలక్టరేట్ వద్ద హెల్త్ సెక్రటరీల ఆందోళన (ఫైల్)

యాప్‌ల భారం తగ్గించాలి

అనేక రకాల మొబైల్ యాప్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నుంచి సేకరించే సమాచారం ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఉపయోగం కోసమే అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వీటివల్ల రాష్ట్ర ప్రజల వైద్యం, ఆరోగ్య సేవలు ఏమాత్రం మెరుగుపడటం లేదు. భవిష్యత్‌లో ఉద్యోగుల స్థానంలో మొబైల్ యాప్‌ల ద్వారా వైద్య, ఆరోగ్య సేవలు ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం తొందరపడుతున్నట్టు కనపడుతోంది. ఇది ప్రమాదకరం. తక్షణం యాప్‌ల పనిభారం తగ్గించాలి.

- జి.బేబిరాణి, సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు

కనీస వేతనాలు అమలు చేయాలి

2022 పిఆర్‌సి ప్రకారం వేతనాలు, సెలవులు, ప్రమోషన్లు, డిఎ, సౌకర్యాలు అమలు చేయాలి. యాప్‌లలో డేటాను అప్ లోడ్ సమయాల్లో ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లు నాణ్యత లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పై అధికారులు మాత్రం మమ్మల్ని బాధ్యుల్ని చేస్తూ మెమోలు ఇస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ నిబంధనల మేరకు మూడేళ్ల సర్వీస్ దాటిన వారిని గ్రేడ్ 3 నుంచి మెరిట్ ప్రాతిపదికన ప్రమోట్ చేయాలి.

- వరలక్ష్మి, ఎఎన్ఎం, పెద్దాపురం.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దువ్వా శేష బాబ్జి తదితరులు

బిజెపి విధానాలకు వ్యతిరేకంగా ప్రచారోద్యమం

ప్రజాశక్తి-కాకినాడ

కేంద్ర బిజెపి మోడీ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా, నిరుద్యోగం, అధికధరలు, విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 4 వరకు సిపిఎం ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రచారోద్యమాన్ని ప్రజలంతా జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా నాయకులు దువ్వా శేషబాబ్జి కోరారు. ఆదివారం స్థానిక ఇంద్రపాలెం వంతెన ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం ప్రచార ఉద్యమ కరపత్రాన్ని శేషబాబ్జి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల ధరలు విపరీతంగా పెరిగి సామాన్య మధ్యతరగతి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వివిధ రకాలుగా విద్యుత్ ఛార్జీలు భారీగా వేస్తున్నారన్నారు. చదువుకున్న యువతకు ఉపాధి కల్పించడం లేదన్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆందోళనల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. సెప్టెంబర్ 1న సచివాలయాల వద్ద విద్యుత్ బిల్లులు దహనం చేస్తామన్నారు. సెప్టెంబర్ 3వ తేదీన నిరుద్యోగులతో సదస్సు నిర్వహిస్తామన్నారు. సెప్టెంబర్ 4వ తేదీన మండల కార్యాలయాల వద్ద ధర్నా చేపడతామన్నారు. కె.సత్తిరాజు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి మన రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు వారికి భజన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రధాన ప్రతిపక్షాలు కూడా ఏమాత్రం స్పందించడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలకోసం జరిగే ఉద్యమాలకు ప్రజలు సంఘీభావం తెలపాలన్నారు. సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. మతోన్మాద చర్యలతో ప్రజల ఐక్యతను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో సిపిఎం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రచార ఆందోళన కార్యక్రమాలను కాకినాడ నగరం లో ప్రజలంతా ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు మలకా వెంకటరమణ, దుంపల ప్రసాద్, కె.నాగజ్యోతి, నర్ల ఈశ్వరి, నాగాబత్తుల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పల్లెలను వణికిస్తున్న విషజ్వరాలు

ప్రజాశక్తి -రౌతులపూడి

మండలంలోని పలు గ్రామాలను విష జ్వరాలు వణికిస్తున్నాయి. మండలంలోని రౌతులపూడి, ములగపూడి, బిబి.పట్నం, బలరామపురం, గుమ్మరేగుల, ఎ.మల్లవరం, బంగారయ్యపేట, ఉప ప్రణాళికా ప్రాంతంలోని పలు గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రౌతులపూడి సిహెచ్‌సికి రోజుకు 150 మంది రోగుల వరకు జ్వరం లక్షణాలతో వైద్య సేవల కోసం వస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్యలేమి, వాతావరణ మార్పులు వంటి కారణాలతో జ్వరాలు పట్టి పీడిస్తుండడంతో అవస్థలు తప్పడం లేదు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ఆసుపత్రికి క్యూ కడుతున్న రోగులు

నేడు డయల్ యువర్ కమిషనర్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి 10:30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు తెలిపారు. ప్రజలు కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 08842357800కు కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చునన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. 10:30 గంటల నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని, ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కమిషనర్ తెలిపారు.

సిపిఎం రూరల్ కన్వీనర్‌గా నాగేశ్వరరావు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

సిపిఎం కాకినాడ రూరల్ మండల కన్వీరన్‌గా తిరుమలశెట్టి నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. పార్టీ విస్తత స్థాయి సమావేశం సుందరయ్య భవన్‌లో సిహెచ్.విజయ్‌కుమార్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ మాట్లాడారు. దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్యం లేకుండా చేస్తోందన్నారు. మోడీ అధికారంలోకి వచ్చే ముందు ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. దేశంలో ఉన్న ప్రభుత్వ సంస్థలను మోడీ ప్రభుత్వం ధారధాతంగా కార్పొరేట్ సంస్థలకు అమ్మేస్తోందన్నారు. అనంతరం రూరల్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా తిరుమలశెట్టి నాగేశ్వరరావు, కమిటీ సభ్యులుగా తొట్టిపూడి రాజా, సిహెచ్.విజయ్‌కుమార్, పెద్దింశెట్టి రామకృష్ణ, మేడిశెట్టి వెంకటరమణ ఎన్నికయ్యారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

దోమలతో ప్రాణాంతక వ్యాధులు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రక్తం పీల్చే దోమ చిన్న పరిమాణంలో ఉన్నా ప్రాణాంతక వ్యాధులకు కారణమవుతుందని డాక్టర్ వి.సతీష్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్ బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆడ ఎనాఫిలస్ దోమ వల్ల మలేరియా వ్యాధి వ్యాపిస్తుందని సర్ రోనాల్డ్ రాస్ 1897 ఆగస్టు 20న కనుగొనడంతో అప్పటినుండి ఈ రోజున ప్రపంచ దోమల నివారణ దినోత్సవం గా జరుపుకుంటున్నామని అన్నారు. దోమ కాటు వలన మలేరియాతోపాటు ఫైలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు ఇంట్లోకి దోమలు రాకుండా కిటికీలకు మెస్‌లు వేసుకోవాలని సూచించారు. దోమతెరలు వాడటంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఇంటి పరిసరాలలో ఉండే టైర్లు, ఖాళీ డబ్బాలు, మొక్కలు, బకెట్లు వంటి వాటిలో నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున వాటిలో నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాఘవరావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ హయాంలో సాంకేతిక అభివృద్ధి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా దేశాన్ని సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చేశారని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ శిరీష పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాజీవ్ గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని ఆధునికీకరించడంతోపాటు ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో అనేక కార్యక్రమాలు, విధానాలను ప్రవేశపెట్టారన్నారు. 75 వ రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థల బలోపేతానికి ఆయన కృషి చేశారని అన్నారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని ఆయన హయాంలో ఆమోదించారని అన్నారు. జవహర్ నవోదయ విద్యాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను సరళీకతం చేయడానికి రాజీవ్ గాంధీ ఎంతో కృషి చేశారని శిరీష తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, డాక్టర్ సువర్ణ రాజు, ఎల్.కృష్ణమూర్తి, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై చర్చించాలని అంగన్‌వాడీల వినతి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్పకు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం వినతిపత్రం అందజేశారు. అచ్చంపేటలోని ఎంఎల్ఎ కార్యాలయంలో అంగన్‌వాడీల నాయకులు ఆయనను కలిసి సమస్యలపై వినతిపత్రం అందచేశారు. అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ అమలు చెయ్యాలని, ఐసిడిఎస్ పరిరక్షణ కోసం, అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యూటీ అమలు చెయ్యాలని శాసన సభలో చర్చించాలని కోరారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రభుత్వ విధానాల వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను అనేక రెట్లు పెరిగాయని, కానీ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచలేదన్నారు. అంగన్‌వాడీలకు తెలంగాణా కన్నా అదనంగా వేతనాలు పెంచుతానన్న ముఖ్య మంత్రి హామీ ఏళ్లు గడుస్తున్నా, అమలు చెయ్యడం లేదన్నారు. తెలంగాణాలో 2021 జూలై నెల నుండి వర్కర్లకు రూ.13,650, హెల్పర్స్, మినీ వర్కర్స్‌కు రూ.7,800 ఇస్తున్నారని, కాని మన రాష్ట్రంలో అంగన్‌వాడీలకు వేతనాలు పెంచలేదన్నారు. అందరికీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కూడా అమలు చెయ్యడం లేదని, సెంటర్ల నిర్వహణకు అంగన్‌వాడీలు పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. 2017 నుండి టిఎ బిల్లులు ఇవ్వడం లేదన్నారు. 2022 ఏప్రిల్ 25 అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు అంగన్వాడీలకు గ్రాట్యూటీ అమలు చెయ్యమని చెప్పిన తీర్పు ఇంత వరకు అమలులేదని తక్షణం వీటిని అమలు చేయాలని శాసన సభలో చర్చ జరపాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ నాయకులు టి.నాగమణి, ఎ.అమలావతి, టి.ఎల్.పద్మ, చంటమ్మ, మహాలక్ష్మి, నాగమణి, సిఐటియు నాయకులు డి.క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

ఎంఎల్ఎకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

లయన్స్ ఆధ్వర్యంలో మధుమేహంపై అవగాహన

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

సర్పవరం జంక్షన్‌లో లయన్స్ క్లబ్ కాకినాడ జెమ్స్ ఆధ్వర్యంలో మధుమేహంపై ఆదివారం అవగాహన శిబిరం, అనంతరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సువర్ణ రాజు మాట్లాడుతూ ప్యాంక్రియాస్‌తో శరీరంలో తయారైన ఇన్సులిన్ హార్మోన్ కణాల్లోకి చక్కెరను అనుమతించడానికి కీలకంగా పని చేస్తుందన్నారు. కణాలు గనుక స్పందించకపోతే మధుమేహం వ్యాధిగా పరిగణించాలని అన్నారు. ఊబకాయం, మానసిక ఒత్తిడి, శారీరక వ్యాయామం లోపించడం, వంశపారంపర్యంగా మధుమేహం వచ్చే అవకాశం ఉందన్నారు. అధిక దాహం, ఆకలి ఎక్కువగా ఉండటం, తరచూ మూత్ర విసర్జన, పాదాలలో తిమ్మిర్లు, మానని గాయాలు మధుమేహం లక్షణాలన్నారు. దీనిని అశ్రద్ధ చేస్తే గుండె జబ్బులు, మూత్రపిండాల వైఫల్యం, కంటి చూపు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. మధుమేహానికి జీవితాంతం మందులు వాడాలని అన్నారు. మధుమేహం వస్తే వైద్యుల సూచనలు మేరకు మందులు వాడుతూ శారీరక వ్యాయామం చేయాలన్నారు. మధుమేహం రాకుండా ఉండాలంటే చక్కటి జీవనశైలితో పాటు ప్రతిరోజు శారీరక వ్యాయామం చేయాలన్నారు. మానసిక ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ఉండాలని సువర్ణ రాజు తెలిపారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు లింగమల్లు కృష్ణమూర్తి, క్లబ్ అధ్యక్షుడు ఎం.సతీష్, జోన్ చైర్మన్ పి.నాగేశ్వరరావు, ఎల్.శ్రీనివాసరావు, ఎఎంఎస్ఎన్ మూర్తి, అడబాల రత్న ప్రసాద్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరం దేవస్థానం కొండపైన కొత్తగా విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు వల్ల నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్తును అందించవచ్చని ఎపిఇఆర్‌సి చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి అన్నారు. కొండపైన ఇటీవల నిర్మించిన 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఈ కొత్త సబ్‌స్టేషన్ వల్ల దేవస్థానం అవసరాలకే కాక అన్నవరంలో కూడా అవసరమైన నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అవకాశం ఏర్పడిందన్నారు. తొలుత జస్టిస్ నాగార్జున రెడ్డికి దేవస్థానం చైర్మన్ ఐవి రోహిత్ ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎపిఆర్‌సి సభ్యులు రమా సింగ్ వెంకటరామిరెడ్డి, సిఎండి కె.సంతోష్ రావు జగ్గంపేట డిఇ రత్నాలరావు, దేవస్థానం విద్యుత్ అధికారులు సూర్యనారాయణ చౌదరి పాల్గొన్నారు.

సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న జస్టిస్ నాగార్జున రెడ్డి

నేడు కాకినాడకు సిపిఐ యాత్ర

ప్రజాశక్తి-కాకినాడ

సిపిఐ బస్సు యాత్ర సోమవారం కాకినాడకు వస్తోందని పార్టీ జిల్లా కార్యదర్శి బోడకొండ ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక హోదా, కోస్టల్ కారిడార్, మత్స్య సంపద తదితర అంశాలపై కాకినాడలో గాంధీభవన్‌లో ఉదయం 10:30 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందన్నారు. దీనికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కాకినాడ సిటీ మాజీ ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వరరావు, ప్రత్యేక హోదా పోరాట సమితి నాయకులు చలసాని శ్రీనివాసరావు, ఇతర రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు హాజరవుతారన్నారు.



వల్లభ స్వామి ఆలయాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలోని శ్రీశృంగార వల్లభ స్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి జరుగుతోందని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరు దొరబాబు అన్నారు. ఆదివారం ఆలయంలో రూ.98 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయరాజు, రాష్ట్ర కార్మిక శాఖ నాయకులు దవులూరి సుబ్బారావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కర్రి వెంకట జగదీష్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఈ ఆలయానికి వచ్చే యాత్రికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని రూ 3.5 కోట్ల వ్యయంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, ఎంపిటిసి కుంచే బుచ్చిరాజు, నరాలశెట్టి బాబ్జిరావు, ఒబిలిశెట్టి కాశీ, కుంచే అమరావతి, త్రినాధ్, లక్కాకుల నానాజీ, తుమ్మల అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

ఆలయంలో ఎంఎల్ఎ చినరాజప్ప పూజలు

శృంగార వల్లభ స్వామి ఆలయంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చిన్నరాజప్ప ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తెం వెంకట శ్రీనివాసరావు(కోటి), తిరుపతి సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, కొమ్మిరెడ్డి బుజ్జి, రేలంగి వెంకటరావు, రేలంగి బుజ్జి పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న దొరబాబు

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

రూ.10 లక్షల టిడిడి నిధులతో పవర గ్రామంలో నిర్మించనున్న శ్రీ సిద్ధి వినాయక ఆలయం నిర్మాణ పనులకు ఆదివారం స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు శంకుస్థాపన చేశారు. తొలుత గ్రామానికి వచ్చిన దవులూరి దొరబాబుకు వైసిపి మండల అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. తొలుత ఆలయం వద్ద పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మినీ ఫిష్ రిటైల్ ఔట్‌లెట్ ప్రారంభం

ప్రజాశక్తి - తాళ్లరేవు

గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ధరలకే ప్రజలకు నాణ్యమైన మత్స్య ఉత్పత్తులు అందజేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఫిష్ ఆంధ్ర మినీ ఫిష్ రిటైల్ ఔట్ లెట్‌ను ఎంపిపి రాయుడు సునీత గంగాధర్ ఆదివారం ప్రారంభించారు. తాళ్లరేవులోని చెరువుగట్టు సెంటర్ వద్ద పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వాహకురాలు రచ్చ పద్మ ఏర్పాటు చేసిన ఫిష్ ఔట్ లెట్‌లో ఎంపిపి సునీత కొద్దిసేపు ప్రజలకు చేపలను విక్రయించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రజలందరికీ మేలు చేయాలనే ఉద్దేశంతో ఫిష్ ఆంధ్ర అవుట్ లెట్స్ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ ఎఫ్డిఒ గోపి మాట్లాడారు. ప్రభుత్వం నాణ్యమైన చేపలు, రొయ్యలు వంటి మత్స్య ఉత్పత్తులను వినియోగదారులకు స్వచ్ఛమైన ఉత్పత్తులు సరసమైన ధరలకు అందించడానికి ఫిష్ అవుట్ లెట్ తెరిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ ఎడిఎం.లావణ్య, ఎంపిటిసి రచ్చ ముత్యాలు, రెడ్డి రెడ్డిబాబు, జెడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, దేవస్థానం కమిటీ చైర్మన్ కొల్లు శ్రీను, నందికోళ్ల శ్రీమన్నారాయణ, చిట్టూరి చలపతి, బొంతు మోహన్, బొంతు శ్రీనివాస్, మోర్త రాంబాబు పాల్గొన్నారు.



చేపలు విక్రయిస్తున్న ఎంపిపి సునీత

స్టూడెంట్ ఛాప్టర్‌లో సభ్యులు

ఆదిత్యలో స్టూడెంట్స్ ఛాప్టర్ ప్రారంభం

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ (ఇండియా) స్టూడెంట్స్ చాప్టర్ ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కాకినాడ శాఖ కార్యదర్శి ఎస్.దుర్గాప్రసాద్, కాకినాడ బ్రాంచ్ చైర్మన్ బాదం సుందరరావు, మాజీ చైర్మన్ పి.సూర్య ప్రకాష్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సివిల్ విభాగాధిపతి డాక్టర్ బి.రామ్మోహన్ రెడ్డి, ప్రొఫెసర్ ఎస్.గోవింద రాజన్, ప్రొఫెసర్ రవికిషోర్ తృతీయ సంవత్సర విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ప్రమాదంలో గాయపడిన యువకుడు

కారు స్తంభాన్ని ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లి గ్రామ శివారున జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న స్తంభాన్ని ఢీకొనడంతో కారు ముందుభాగం నుజ్జు నుజ్జయ్యి కారులో ఉన్న వై.సూరిబాబు, మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కారులో సుబ్బయంపేట నుంచి రాజమహేంద్రవరం శుభకార్యానికి వెళుతుండగా మల్లేపల్లి గ్రామ శివారు పెట్రోల్ బంకు సమీపం వచ్చేసరికి అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న స్తంభాన్ని ఢీకొంది. సమాచారం తెలుసుకున్న స్థానికులు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

గాయపడిన మహిళ మృతి

ప్రజాశక్తి-కొత్తపేట

గాయపడి చికిత్స పొందుతూ మహిళ మృతి చెందినట్లు కొత్తపేట ఎఎస్.ఐ డి.శశాంక తెలిపారు. మండల పరిధిలోని ఏనుగుల మహల్ సలాది వారి వీధికి చెందిన సలాది ధనలక్ష్మి (45) గత నెల 29న గత సంవత్సరంలో మిగిలిపోయిన చిచ్చుబుడ్డిలను వెలిగించారు. ఒక్కసారిగా మంటలు ఎగసిపడడంతో ఆమె గాయపడ్డారు. దీంతో కుటుంబసభ్యులు రావులపాలెంలోని ఒక ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తీసుకువెళ్లారు. అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు అదనపు ఎస్.ఐ తెలిపారు.

సభలో ప్రసంగిస్తున్న మట్టే శ్రీనివాస్

అందరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ఎల్లప్పుడూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని శ్రీలలిత ఎంటర్‌ప్రైజెస్ మేనేజింగ్ డైరెక్టర్ మట్టే శ్రీనివాస్ అన్నారు. స్థానిక మట్టే ఆదినారాయణ, నాగమణి ఆర్యవైశ్య సేవా సంఘం కళ్యాణ మండపంలో ఆదివారం ఆర్యవైశ్య సేవా సంఘం, వాసవి క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. అందరికీ ఉచితంగా వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఈ వైద్య శిబిరాన్ని పట్టణ ప్రజలే కాక పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సభలో మట్టే ఆదిశంకర్, వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కాకి మణికంఠ కుమార్, ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎం.శ్రీనివాస్, గ్రంధి గోపాల్, శ్రీరాం ప్రకాష్ ప్రసంగించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 500 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో ప్రజలకు ఆరోగ్య పరిరక్షణపై డాక్టర్లు అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో వాసవి క్లబ్ సభ్యులు, వనితా సభ్యులు, యువజన సేవా సంఘ సభ్యులు సేవలందించారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న నాయకులు

శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

గాడిమొగ పంచాయతీ బాబా నగర్ గ్రామానికి అధికారికంగా శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పెయ్యల రమేష్, బిఎస్‌పి అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉపాధ్యక్షుడు వాకపల్లి భీమారావు డిమాండ్ చేశారు. గాడిమొగ పంచాయితీ బాబానగర్ వాసులకు శ్మశాన వాటిక లేదని, కొన్ని రోజుల క్రితం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో బాబా నగర్‌కు అర కిలోమీటర్ దూరంలో ప్రభుత్వ భూమిని శ్మశాన వాటికకు వాడుకునేందుకు ప్రభుత్వం అనుమతించిన్నారు. గాడిమొగ గ్రామస్తులు అభ్యంతరాలు తెలపకుండా పూర్తిస్థాయిలో సరిహద్దులు నిర్మించి స్థలాన్ని అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాత సుబ్రహ్మణ్యం, మోకా దుర్గా ప్రసాద్, తాడి షణ్ముఖరాజు, కమిడి శ్రీను, కుసుమ శ్రీనువాస్, దడాల శ్రీనివాస్, మోర్త విజయ్, చందు. గల్లా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు యథావిధిగా 'స్పందన'

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక స్పందన కార్యక్రమం స్థానిక కలెక్టరేట్ లోని స్పందన హాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ స్పందన కార్యక్రమంలో జిల్లాస్థాయి సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకుని రావచ్చునని అన్నారు. అర్జీలకు వచ్చి పరిష్కార మార్గాలు పొందాలని ఆయన అర్జీదారులకు విజ్ఞప్తి చేశారు.

మాతా శిశు మరణాల నివారణకు చర్యలు

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అరుణ

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

మాతా, శిశు మరణాలను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా తల్లీబిడ్డల సంరక్షణకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వి.అరుణ అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవల్లో ఈ కార్యక్రమం అత్యంత కీలకమైనదన్నారు. వివాహమైన నాటి నుంచి కుటుంబ నియంత్రణ, శస్త్ర చికిత్స వరకు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలపైనే ప్రజలు ఆధారపడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అమలవుతున్న ఇమ్యునైజేషన్ కార్యక్రమం గురించి ప్రజాశక్తికి ఆమె పలు అంశాలను వివరించారు.

ఇమ్యునైజేషన్ కోసం ఎవరిని సంప్రదించాలి.?

వివాహ అనంతరం తొలి గర్భం దాల్చిన తర్వాత ఆరోగ్య కార్యకర్తల వద్ద టీకాల కోసం నమోదు చేసుకోవాలి. నమోదైన ప్రతి మహిళకూ వైద్య ఆరోగ్యశాఖ కార్యకర్తలిచ్చే ఎంసిపి కార్డు తప్పనిసరి. ఈ కార్డు ఆధారంగానే గర్భవతి మొదలు పుట్టిన పిల్లలకు ఏడాదిన్నర వచ్చేంతవరకు వారికి అందించే వ్యాధి నిరోధక టీకాలు, ఇతర ఆరోగ్య వివరాలు అందులో నమోదు చేసేందుకు వీలవుతుంది. దీని ఆధారంగానే టీకాలు వేస్తారు. అలాగే ప్రతి గర్భిణులు వివరాలను ఆరోగ్య కార్యకర్త, ఆశ తప్పనిసరిగా నమోదు చేసుకుని వారికి సకాలంలో వైద్య సేవలు అందించడం ద్వారా కాన్పు సుఖంగా జరగడానికి తోడ్పడుతుంది. దీనికి తోడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుఖంగా కాన్పు నిర్వహించేందుకు ఆసక్తి పెరుగుతోంది.

టీకాల కార్యక్రమం వివరాలు తెలియజేయండి.?

జిల్లాలో ప్రతి సంవత్సరం యూనివర్సల్ ఇమ్యునైజేషన్ కార్యక్రమం జరుపుతున్నాం. జిల్లాలో 22 లక్షల 47 వేల 860 మంది జనాభా ఉన్నారు. వీరిలో సున్నా నుంచి ఐదేళ్ల లోపు సుమారు 2 లక్షల మంది పిల్లలు ఉండగా వీరికే ఎక్కువగా టీకాలు వేయాల్సి ఉంటుంది. జిల్లా మొత్తంగా 2 వేల పాయింట్లలో కాకినాడ జిజిహెచ్, 2 ఏరియా ఆసుపత్రులు, 10 సిహెచ్‌సిలు, 44 పిహెచ్‌సిలు, 23 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 635 ఆరోగ్య సచివాలయాలు ద్వారా పిల్లలందరికీ టీకాలు వేస్తున్నాం.

ఏయే టీకాలు ఎలా వేస్తున్నారు.?

పిల్లలు పుట్టగానే డిసిజి టీకా, 14 రోజుల తర్వాత పోలియో నిర్మూలనకు ఒపివి జీరో డోస్, పుట్టిన 24 గంటల లోపు పచ్చకామెర్ల నివారణకు హెపటైటిస్ బి టీకా, ధనుర్వాతం, కంఠసర్పి, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు ఒకే పెంటావేలెంట్ టీకాను 6, 10, 14 వారాలలో 3 డోసులు వేస్తారు. దీంతో పాటు పోలియోకి సంబంధించిన ఒపివి, ఐపివి టీకాలు కూడా వేస్తారు. విరేచనాల తగ్గుదలకు 6, 10, 14 వారాల పిల్లలకు రూటా వైరస్ డ్రాప్స్ లను వేస్తాము. 9 నెలలు నిండిన తర్వాత తట్టు వ్యాధి, పొంగు వ్యాధి రాకుండా మీజుల్స్, రూబెల్లా(ఎంఆర్) రెండు టీకాలను, 2వ డోసు మరలా 18 నెలలకు వేస్తున్నాం. దీంతో పాటు విటమిన్ ఎ సిరప్ కూడా వేస్తున్నాం. ప్రతి 6 నెలలకొకసారి 5 ఏళ్ల వరకూ 9 డోసులు విటమిన్ సిరప్ ఇస్తున్నాం. 10వ ఏట, 16వ ఏట టిటి వేస్తున్నాం. రెండేళ్ల పిల్లలకు డిఫ్టీరియా వ్యాక్షిన్ వేస్తున్నాం. ఇలా 16 ఏళ్లు పూర్తయ్యే వరకూ పిల్లలకు పూర్తి ఇమ్యునైజేషన్ చేస్తున్నాం. అలాగే ప్రతి సంవత్సరం జనవరిలో పల్స్ పోలియో వ్యాక్సిన్ కార్యక్రమం విధిగా నిర్వహిస్తున్నాం.

టీకాలు వేసే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు.?

వ్యాధి నిరోధక టీకాలు వేసే సమయంలో ఆరోగ్య కార్యకర్తలు తగిన జాగ్రత్తలు తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. కరోనా వైరస్ వ్యాప్తి తరువాత నుంచి టీకాలు వేసే సమయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. తప్పనిసరిగా మాస్క్ ధరించడంతో పాటు చేతులకు గ్లౌజులు ధరించాల్సి ఉంటుంది. వాక్సినేషన్ సమయంలో భౌతిక దూరాన్ని పాటించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వాక్సిన్ వేసిన ప్రతిసారీ శానిటైజర్‌ను తప్పక పూసుకోవాల్సి ఉంటుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి వీటిని తీసుకున్న తర్వాత మాత్రమే వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నాం.

మాతా, శిశు మరణాల రేటును తగ్గించేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు.?

తల్లీ బిడ్డలు క్షేమంగా ఉంటే అందరికీ సంతోషం. అందుకే మాతా,శిశువు ఆరోగ్యంపై జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ప్రస్తుతం అత్యంత ప్రాధాన్యతగల అంశాల్లో మతాశిశు సంరక్షణ ఒకటి. పునరుత్పత్తి, శిశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. అందువల్లే ఆస్పత్రి కాన్పులపై మహిళల్లో అవగాహన కల్పించడం జరుగుతోంది. గతంలో ఊళ్లలోనే తాత్కాలిక వైద్యులు, పురుడుపోసే వారి సాయంతో కాన్పు జరిపించేవారు. ఆ సమయంలోనే సరైన వైద్యం అందక మాతాశిశు మరణాలు ఎక్కువగా సంభవించేవి. ఊళ్లలో ప్రసవానికి వైద్యం అందుబాటులో ఉండక అప్పట్లో అనేక విధానాలు అవలంబించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వాస్పత్రుల్లో ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. అందుకే ఇంటి వద్ద ప్రసవం కంటే ఆస్పత్రిలో ప్రసవాలే మంచిదని ప్రజల్లో అవగాహన కల్పించడం జరుగుతోంది. అందుకోసం జనని సురక్ష యోజన పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా పేదకుటుంబానికి చెందిన గర్భం దాల్చిన మహిళలకు వైద్య సేవలతో పాటు ఆస్పత్రిలో ప్రసవానికి వచ్చేలా ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తోంది.

మాట్లాడుతున్న శ్రీనివాస్

పట్టాదారులకు దస్తావేజులు ఇవ్వండి

ప్రజాశక్తి - పెద్దాపురం

వన్ టైం సెటిల్మెంట్ పేరుతో ఇంటి పట్టాలు ఉన్నవారికి పూర్తిస్థాయి హక్కులతో దస్తావేజులు ఇస్తామని చెప్పి ఒక్కొక్కరి వద్ద నుండి రూ.15 వేలు వసూలు చేసి సంవత్సరం గడిచినా ఇప్పటివరకు వారికి దస్తావేజులు ఇవ్వకపోవడం అన్యాయమని సిపిఎం నాయకులు సిరపరపు శ్రీనివాస్ అన్నారు. స్థానిక వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు భవనంలో ఆదివారం రొంగల వీర్రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దస్తావేజులు ఇవ్వకపోతే కట్టిన రూ.15 వేలు ఇవ్వాలని పట్టాదారులు విజ్ఞప్తి చేస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పట్టాదారులు సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా సరైన సమాధానం చెప్పడం లేదన్నారు. అధికారులు వన్ టైం సెటిల్మెంట్ నిమిత్తం రూ.15 వేలు చెల్లించిన వారందరికీ వెంటనే పట్టాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు, దారపురెడ్డి కృష్ణ, రొంగల సుబ్బలక్ష్మి, నెక్కల నరసింహమూర్తి, గరగపాటి పెంటయ్య, యాసలపు రమేష్ పాల్గొన్నారు.

మహిళలకు అండగా టిడిపి మహాశక్తి

ప్రజాశక్తి-పెదపూడి

తెలుగుదేశం పార్టీ మహానాడులో ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన మ్యానిఫెస్టోలో మహిళల కోసం ప్రకటించిన మహాశక్తి పథకం ద్వారా మహిళలకు అద్భుతమైన లబ్ధి చేకూరుతుందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం అనపర్తి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జుత్తుక సూర్యకుమారి అధ్యక్షతన అచ్యుతాపురత్రయం గ్రామంలో జరిగిన మహాశక్తి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి పథకాలు ఎటువంటి ఆంక్షలూ, కోతలూ లేకుండా అర్హులందరికీ పూర్తి స్థాయిలో అందిస్తామన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత పథకాలలో ఏవిధంగా కోత విధిస్తున్నారో వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ అధికార ప్రతినిధి బేరా వేణమ్మ, జిల్లా మహిళా అధ్యక్షులు శేషారత్నం, మండల అధ్యక్షురాలు సత్యవతి, సుభాషిణి, పుట్టా గంగాధర చౌదరి, జుత్తుక కృష్ణ, బదిరెడ్డి చిట్టిబాబు, సానా శ్రీను పాల్గొన్నారు.

యానాం వార్తలు

బైక్‌పై దేశాన్ని చుట్టిన యానాం యువకుడు

ప్రజాశక్తి - యానాం

కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు అనేదానికి గుర్రాల రేవంతసాయి ఒక నిదర్శనంగా చెప్పవచ్చు. 19 ఏళ్ల వయస్సులో మూడున్నరేళ్ల పాటు బైక్‌పై దేశాన్ని చుట్టివచ్చాడు. యాత్రలో ఎదురైన ఎన్నో అవరోధాలను, అవాంతరాలను అధిగమించి తను అనుకున్న లక్ష్యాన్ని సాకారం చేశాడు. యానాంకు చెందిన రేవంతసాయి భారత భూభాగం అంతా బైకుపై చుట్టిరావాలన్న ధృడ సంకల్పంతో 2020 ఫిబ్రవరి 10న ప్రారంభించిన బైక్ యాత్ర 2023 ఈ నెల 14తో ముగిసింది. విశాఖ, ఒడిశా, చత్తీస్‌గడ్ మీదుగా సాగిన బైక్ యాత్ర ఈశాన్య రాష్ట్రాలు, ఉత్తర, దక్షిణ భారత రాష్ట్రాలను లడక్, కాశ్మీర్‌ను చుట్టి...ఎన్నో ప్రదేశాలను తిలకిస్తూ, నేతలను కలుస్తూ, ఫిట్ ఇండియాపై అవగాహన కల్పిస్తూ సాగాడు. ఎన్నో ఒడిదుడుకులను తట్టుకుని విజయవంతంగా యానాం చేరుకున్నాడు. యాత్ర ముగింపు దశలో బైకుపై నుంచి జారిపడి ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. సాహసం, ధైర్యంతో యాత్ర చేసిన సాయిని పలువురు అభినందించారు.

సెప్టెంబర్ 24న రామానుజన్ పరీక్ష

ప్రజాశక్తి - యానాం

రామానుజ గణిత అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించే రామానుజన్ పరీక్ష సెప్టెంబర్ 24 నిర్వహించనున్నట్లు రామానుజన్ గణిత అకాడమీ యానాం శాఖ అధ్యక్షుడు ఆనాల వీరభద్రరావు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరీక్ష నాలుగో తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులకు మాత్రమే నిర్వహిస్తారన్నారు. పరీక్ష ఫీజును ఆగస్టు 30లోగా చెల్లించాలని కోరారు.

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

ప్రజాశక్తి - యానాం

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని స్థానిక సమాచార శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఫెర్రీ రోడ్డు రాజీవ్ పార్క్‌లో ఉన్న ఆయన విగ్రహానికి యానాం పరిపాలనాధికారి మునిస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఖండవల్లి రామకష్ణ, ఎస్‌పి రఘునాయగం, సిఐ షణ్ముగం, స్పెషల్ బ్రాంచ్ ఎఎస్‌ఐ రమణమూర్తి, కెఎల్‌వి.ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కనకాల పేట ఏటిగట్టు రోడ్డు దుస్థితి

రోడ్డు పక్కన ఏపుగా పెరిగిన మొక్కలు

ప్రజాశక్తి - యానాం

యానాం బైపాస్ నుంచి కనకాల పేటకు వెళ్లే ఏటిగట్టు రోడ్డు పక్కన పిచ్చి మొక్కలు బాగా పెరగడంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. డంపింగ్ యార్డ్ నుంచి దట్టమైన పొగ రావడంతో ఆ సమయంలో రోడ్డును పూర్తిగా పొగ కమ్మేయడంతో రోడ్డు కనిపించగా వాహనాదారులు మొక్కల్లోకి చొచ్చుకుపోయి ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ మొక్కల నుంచి పాములు బయటకు రావడంతో పాదాచారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పిచ్చి మొక్కలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్తి కానీ అప్రోచ్ రోడ్డు

నిరుపయోగంగా మారిన రెండవ వంతెన

ఎదురెదురు వాహనాలతో ట్రాఫిక్‌కు అంతరాయం

ఏళ్లు గడుస్తున్నా వినియోగంలోకి రాని వంతెన

- పూర్తికాని అప్రోచ్ రోడ్డు పనులు
- ప్రయాణికులకు తప్పని ట్రాఫిక్ కష్టాలు
- పూర్తిచేయాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి-మండపేట

పట్టణ ముఖ ద్వారం వద్ద ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించడంలో భాగంగా పెద్దకాలువ వంతెన చెంతనే నిర్మించిన రెండవ వంతెనకు ఇరువైపులా చేపట్టిన అప్రోచ్ రోడ్డు పనులు ఏళ్లు గడుస్తున్న పూర్తికాకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

జలవనరుల శాఖ ఆధ్వర్యంలో రూ.86 లక్షల అంచనాలతో గోదావరి డెల్టా ఆధునికీకరణలో భాగంగా చేపట్టిన అప్రోచ్ రోడ్డు పనులకు ఇప్పటి వరకు రూ.60 లక్షల నిధులను ఖర్చు చేశారు. మిగిలిన రూ.11 లక్షలకు పనులు జరగాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. పనులు పూర్తి కాకపోవడంతో వంతెన నిరుపయోగంగా మారిడంతో వాహనదారులు ఒక వైపు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో తరచు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. అంతేకాకుండా పాత వంతెన రెయిలింగ్ విరిగిపోయి ప్రమాదాలను తలపిస్తోంది.

ఈ విషయంపై రామచంద్రపురం సెక్షన్ ఇఇ రామకృష్ణను వివరణ కోరగా అప్రోచ్, బిటి రోడ్డు పనులు పూర్తి చేయాల్సి ఉందని కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో ఈ పనికి సంబంధించిన అగ్రిమెంటు పూర్తి అయ్యిందన్నారు.

పనుల్లో జాప్యంతో ఇబ్బందులు

వంతెనల నిర్మాణ పనుల్లో జాప్యం నెలకొనడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. ట్రాఫిక్ సమస్య తీరకపోగా అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో కాలుష్య సమస్య అధికమవుతోంది. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప పనులు పూర్తి కావడం లేదు. అప్రోచ్, రోడ్డు పనులు పూర్తి చేసి వంతెనను వినియోగంలోకి తీసుకురావాలి.

-అప్పరబోతు దుర్గాప్రసాద్, స్థానికుడు

తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం

పనులు పూర్తి కాకపోవడంతో వంతెన నిరూపయోగంగా మారింది. దీంతో వాహనదారులు ఒక వైపు రాకపోకలు సాగిస్తుండటంతో తరచు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు ఈ సమస్యపై తక్షణం స్పందించి చర్యలు చేపట్టి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నా.

-కోన సత్యనారాయణ, బిసిసంఘ నాయకులు

కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిపై ప్రయివేటు పెత్తనం

- శృతిమించుతోన్న సెక్యూరిటీ గార్డుల ఓవరాక్షన్
- అసభ్యపదజాలంతో రోగులు, వారి బంధువులను దూషిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది
- ప్రశ్నించిన వారిపై కర్రలతో విచక్షణారహితంగా దాడి..

కర్రతో దాడి చేస్తున్న వైనం..

ప్రజాశక్తి-కాకినాడ కార్పొరేషన్

కాలు కిందసి తొక్కేస్తా..నీ అయ్య జాగీర ఎక్కడపడితే అక్కడ పడుకుంటున్నావ్..ఒకటి కాదు రెండు కాదు ఎవరిని పడితే వారిపై నోటి దురుసు ప్రవర్తనతో సామాన్య ప్రజలను తీవ్ర ఆవేదనకు గురి చేస్తున్నారు. ఇది ఎక్కడో కాదు మన కాకినాడ సామాన్య ప్రభుత్వ ఆసుపత్రిలోనే..అక్కడ సెక్యూరిటీ సిబ్బంది తీరు ఇది.. అయితే ఇదంతా అక్కడ ఉన్న ప్రధాన కాంట్రాక్టర్ ఒకరు చూసుకునిరెచ్చి పోతున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిని తన గుప్పెట్లో ఉన్నట్లు అందరితో చెప్పుకుంటూ,అక్కడ చేసే ప్రభుత్వ ఉద్యోగులు కూడా అతనికి సలాం కొట్టకపోతే సెక్షన్లో మార్చేస్తానట్లు పెత్తనం సాగించడం వల్లే సామాన్య ప్రజలను సెక్యూరిటీ సిబ్బంది తీవ్ర ఇబ్బందికి గురి చేస్తున్నట్లు సామాన్య ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అది కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి.. నిత్యం కొన్ని వేల మంది రోగులు ఇక్కడికి వైద్య సేవల కోసం వస్తుంటారు. వారిలో కొందరు ఇన్‌పేషంట్లుగా ఉంటే.. మరికొందరు ఔట్ పేషంట్లుగా ఉంటారు. నిత్యం ఒపి విభాగం మధ్యాహ్నం ఒంటి గంట వరకు కిటకిటలాడుతూనే ఉంటుంది. వివిధ ఆనారోగ్య సమస్యలతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాసులతో పాటు, పశ్చిమ గోదావరి జిల్లా వాసులు కూడా ఇక్కడికి వస్తుంటారు. అయితే ఇక్కడ రోగుల పరిస్థితి దారుణంగా తయారైంది. ముఖ్యంగా సెక్యూరిటీ సిబ్బంది నిర్వాకంతో రోగులు బెంబేలెత్తిపోతున్నారు. తమ బంధువులకు ఏమైందో, వారి ఆరోగ్యం ఎలా ఉందో తెలుసుకుందామని ఆత్రుతగా వస్తున్న వారిపై కర్ర పెత్తనం చెలాయిస్తున్నారు. ముఖ్యంగా నోరు పారేసుకుంటూ.. ఇష్టమొచ్చిన మాట్లాడుతున్నారని పలువురు వాపోతున్నారు. ఏదో జిజిహెచ్ మొత్తం వీరి సొంత జాగీరులా ఫీలవుతూ.. నిరుపేద రోగులపై రెచ్చిపోతున్నారు. ఏయ్ ఓయ్ వంటి మాటలేకాదు.. ఏరా? పోరా అంటూ చెలరేగిపోతున్నారు. ఇదేమని ప్రశ్నించిన వారిపై సెక్యూరిటీ గార్డులు మూకుమ్మడిగా దాడులు చేస్తున్నారు. రోగుల బంధువులను తాగుబోతులుగా చిత్రీకరించి నోరేసుకుని పడిపోతున్నారు. అయితే మహిళా సెక్యూరిటీ గార్డుల రుబాబు మరీ దారుణం. మగాళ్లపై తీవ్రపదజాలంతో రెచ్చిపోతూ.. అవసరమైతే కేసులు కూడా పెట్టేస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ తరహా కేసులు అధికమయ్యాయని పలువురు వాపోతున్నారు. అంతే కాదు "మాతో గొడవ పడితే.. నువ్వు జిజిహెచ్ దాటి బయటకు వెళ్లగలవా?". అంటూ బెదిరింపులకు కూడా దిగుతున్నారం టున్నారు. మీ పేషంట్ల సంగతి తేలుస్తామని, వారికి వైద్యం అందకుండా చేస్తామని కూడా కొంత మంది సెక్యూరిటీ సిబ్బంది వార్నింగ్లు ఇస్తున్నారని రోగులు వాపోతున్నారు. ఒక్కసారిగా సెక్యూరిటీ సిబ్బంది అందరూ ఏకమై రోగులు, వారి బంధువులపై మూకుమ్మడి దాడి చేస్తుండడంతో ఎవరూ నోరు మెదపలేని పరిస్థితి ఎదురవుతోంది. రోగుల పట్ల సెక్యూరిటీ గార్డులు వ్యవహరిస్తున్న తీరుపై జిల్లా కలెక్టర్ కతికా శుక్లా జీజీహెచ్ ఉన్నతాధికారులకు క్లాస్ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

పెరుగుతున్న చోరీలు.

జీజీహెచ్ మొత్తం ప్రైవేటు సెక్యూరిటీ చేతుల్లో ఉన్నా.. అక్కడ దొంగతనాలు మాత్రం తగ్గడం లేదు. పైకి తామంతా ఏదో దొంగతనాలను అరికట్టేసినట్టు బిల్డప్ ఇస్తున్న ఈ సెక్యూరిటీ సిబ్బంది తమ సొంత పనులకు జిజిహెచ్‌ను వాడేసుకుంటున్నారు. అంతే కాదు.. రోగులను డబ్బుల కోసం కూడా పీక్కొని తింటున్న సంఘటనలూ నిత్యకత్యమే. గత కొన్ని రోజులుగా బైక్ దొంగతనాలు జరుగుతున్నాయి. వీటిని అరికట్టడంలో జీజీహెచ్ సెక్యూరిటీ సిబ్బందితో పాటు, అవుట్ పోస్టు పోలీసులు కూడా ఫెయిలైనట్టు రోగుల బంధువులు చెబుతున్నారు.

'టిడిపితోనే మహిళా సంక్షేమం సాధ్యం'

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మహిళల సంరక్షణతోపాటు సంక్షేమం టిడిపితోనే సాధ్యం అవుతాయని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని నవర గ్రామంలో టిడిపి ఆధ్వర్యాన చేపట్టిన మహిళా శక్తి ప్రచార కార్యక్రమంలో ఎంఎల్ఎ చినరాజప్ప ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత గ్రామంలో వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో పూజలు చేపట్టారు. అనంతరం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టిడిపి మహిళా శక్తి ప్రచార కార్యక్రమాన్ని ఇంటింటికీ వెళ్లి చేపట్టారు. ఇటీవల టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన మహిళా సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తోటకూర శ్రీనువాసు, పనసపాడు గ్రామ సర్పంచి చీకట్ల వెంకటేష్, వెన్నా దివాణం, శిద్ధు నూకరాజు, తోట నాగబాబు, కె శ్రీను, అగ్గిరాముడు, బొందల రామలక్ష్మి, మహిళా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.